క్లుప్తంగా

పరామర్శ

కందుకూరు: మండల పరిధిలోని రాచులూరులో పిడుగుపాటుకు గురై మూడు గేదెలు మృతి చెందగా, బాధిత కుటుంబాన్ని సోమవారం సీపీఎం మండల కార్యదర్శి బుట్టి బాల్‌రాజు, కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు జి.సామేలు, సీపీఎం నాయకుడు చిర్ర నర్సింహ తదితరులు పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బాధితులు నిరుపేదలని, ఆ పాడి గేదెలే వారి ఆధారమన్నారు. ప్రభుత్వం రూ.3లక్షలు పరిహారం అందించి ఆదుకోవాలని కోరారు.

విద్యార్థులకు అభినందన



విద్యార్థులను అభినందిస్తున్న కార్పొరేటర్లు

పహాడీషరీఫ్: బాలాపూర్ మండల పరిధిలోనే పది ఫలితాల్లో మామిడిపల్లి జడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులు సత్తాచాటడం అభినందనీయమని గ్రామ మాజీ కార్పొరేటర్లు చుక్క శివకుమార్, ఈరంకి వేణుకుమార్‌గౌడ్ పేర్కొన్నారు. పాఠశాల ఆవరణలో సోమవారం పదో తరగతి ఫలితాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు షీల్డ్‌లను బహుకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మండల స్థాయిలో గ్రామ పాఠశాల విద్యార్థి ఉత్తమ ర్యాంక్ సాధించడం గర్వకారణమన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శిరీషకుమారి, ఉపాధ్యాయులు విజయలక్ష్మి, చంద్రకళ, విజయ్, రాజు, జోయల్, మాలతీ, సుజాత, రమ్య, పద్మ పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



నియామక పత్రాలు అందజేస్తున్న శ్రీనివాస్‌గుప్తా

నాగోలు: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కోకన్వీనర్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా పేర్కొన్నారు. అంతర్జాతీయ ఆర్యవైశ్య ఫెడరేషన్ మహిళా విభాగ్ రాష్ట్ర కార్యవర్గం సభ్యులకు సోమవారం ఆయన నియామక పత్రాలను అందజేశారు. ప్రచార కమిటీ చైర్ పర్సన్‌గా ములుగు శ్రీలత, కోఆర్డినేటర్ పద్మజ, పీఆర్‌ఓగా స్వాతి, ఈసీ మెంబర్‌గా నాగమని, అడ్వైజర్‌గా ఏపూరి రాజ్యలక్ష్మి, ఉపాధ్యక్షులుగా గోలి శ్రీలత, వావిలాల వినోద లలిత, రంగారెడ్డి జిల్లా అధ్యక్షులుగా సంయుక్త, ప్రధాన కార్యదర్శిగా అనూష, కోశాధికారి శ్వేత, పీఆర్‌ఓగా సాయి సర్గి, పొలిటికల్ కమిటీ చైర్మన్‌గా సత్యకళ, ప్రధాన కార్యదర్శిగా లావణ్య, సేవాదల్ కమిటీ చైర్మన్ మాధురికి నియామక పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో చంద్రశేఖర్ గుప్తా, కటకం శ్రీనివాస్, చింతల రజనీకాంత్ గుప్తా, లోకేష్, స్వప్న పాల్గొన్నారు.

సమాజానికి ఉపయోగపడే పరిశోధనలు చేయాలి



సావనీర్‌ను విడుదల చేస్తున్న వక్తలు

నాగోలు: విద్యార్థులు కొత్త ఆలోచనలతో సమాజానికి ఉపయోగపడే పరిశోధనలు చేయాలని ఢిల్లీలోని డీఆర్‌డీఓలోని స్పిక్ ల్యాక్ డైరెక్టర్ డాక్టర్ మాణిక్యవాసగం అన్నారు. ఆదివారం రాత్రి ఎల్‌బీనగర్‌లో నిర్వహించిన బెస్ట్ ఇన్నోవేషన్ యూనివర్సిటీ ఐదో అంతర్జాతీయ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. విద్యార్థులు దేశ భద్రత, సామాజిక శాస్త్ర, విద్యా, వైద్య కోసం కొత్త పరిశోధనలు చేయాలని సూచించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఉపయోగించుకొని నూతన ఆవిష్కరణలు ఎలా చేయాలో నేర్చుకోవాలని సూచించారు. మెక్రోస్థాయిలో పరిశోధనలు చేయాలని వాతావరణ శాఖ కేంద్ర డైరెక్టర్ డాక్టర్ నాగరత్న సూచించారు. మాజీ ఎమ్మెల్సీ రామ్‌చందర్‌రావు మాట్లాడుతూ.. అన్ని విశ్వవిద్యాలయాల్లో విద్యార్థులను పరిశోధనల కోసం ప్రోత్సహించాలన్నారు. బెస్ట్ ఇన్నోవేషన్ విశ్వ విద్యాలయం చైర్మన్ భరత్‌లాల్ మీనా మాట్లాడుతూ.. పరిశోధనలో కొత్తదనం తీసుకురావడంలో కోసం తమ కాలేజీ పని చేస్తుందని తెలిపారు. ఈ సదస్సులో యుకే, శ్రీలంక, దుబాయ్, అమెరికా ఇతర దేశాల విద్యార్థులు తమ పరిశోధనలు పంపినట్లు ఆయన తెలిపారు. అనంతరం పరిశోధనల సావనీర్‌ను విడుదల చేశారు.

తీరని 'మీసేవ' కష్టాలు

- మొయినాబాద్ మండలంలో ఒకటే సెంటర్
- చుట్టుపక్కల గ్రామాల ప్రజలు, రైతులు, విద్యార్థులకు తప్పని తిప్పలు
- పట్టించుకోని అధికారులు



మొయినాబాద్ మండలంలోని రెడ్డిపల్లి మీసేవ కేంద్రం

మొయినాబాద్: మండలంలో ఒకటే మీసేవ కేంద్రం ఉంది. అది కూడా మండల కేంద్రంలో కాకుండా రెడ్డిపల్లి గ్రామంలో ఉంది. మండల ప్రజలందరూ అక్కడికి వెళ్లాలంటే చాలా కష్టంగా భావిస్తున్నారు. అందుబాటులో మీసేవ కేంద్రం లేక ప్రజలు, విద్యార్థులు, రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గతంలో రెండు మీసేవ కేంద్రాలు మూతపడ్డాయి. మూతపడ్డ వాటిని తెరిపించి కొత్త మీసేవ కేంద్రాలు సైతం ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. కానీ అధికారులు మాత్రం కనీస చర్యలు తీసుకోవడం లేదు. వెంటనే కొత్త కేంద్రాలు ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకోవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి గత నెల 24న మొయినాబాద్‌లో జరిగిన భూ భారతి చట్టంపై అవగాహన కార్యక్రమానికి హాజరైన జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డికి విన్నవించారు. ఇప్పటికైనా మీ సేవ కష్టాలు తీరుతాయో లేదో అని ప్రజలు ఆశగా ఎదురుచూస్తున్నారు.

నాలుగున్నరేళ్లుగా..

ప్రభుత్వ లెక్కల ప్రకారం ప్రతీ 5 వేల జనాభాకు ఒక మీసేవ కేంద్రం ఉండాలి. కానీ మొయినాబాద్ మండలంలో 70 వేలకుపైగా జనాభా ఉన్నా ఒకటే అందుబాటులో ఉంది. సుమారు నాలుగున్నర సంవత్సరాలుగా ఈ పరిస్థితి ఉన్నా కొత్త మీసేవ కేంద్రాలు ఏర్పాటు చేయడంలో ప్రభుత్వం ముందడుగు వేయడం లేదు. దీంతో విద్యార్థులు, నిరుద్యోగులు, రైతులు, ప్రజలకు తిప్పలు తప్పడం లేదు. మొయినాబాద్ మండల ప్రజలకు మీసేవ కష్టాలు తీరడం లేదు. సుమారు నాలుగున్నర సంవత్సరాలుగా ఇబ్బందులు పడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మొయినాబాద్ మండలంతో పాటు మున్సిపాలిటీ మొత్తానికి ఒకే మీసేవ కేంద్రం ఉండడంతో ప్రజల కష్టాలు రోజురోజుకు పెరుగుతున్నాయి. నగర శివారు ప్రాంతంలో ఉన్న మొయినాబాద్ మండలంలో ప్రభుత్వం గతంలో మూడు మీసేవ కేంద్రాలు ఏర్పాటు చేసింది. అందులో రెండు మీసేవ కేంద్రాలు నాలుగున్నర సంవత్సరాల క్రితమే మూతపడ్డాయి. నాలుగున్నర సంవత్సరాల క్రితం హిమాయత్‌నగర్ మీసేవా కేంద్రం నిర్వాహకుడు మరణించడంతో అది మూతపడింది. అదేవిధంగా నాలుగేళ్ల క్రితం మొయినాబాద్ మండల కేంద్రంలోని మీసేవ కేంద్రాన్ని జిల్లా అధికారులు సీజ్ చేశారు. దీంతో రెడ్డిపల్లిలో ఉన్న మీసేవ కేంద్రం ఒక్కటే మండల ప్రజలకు దిక్కయ్యింది. మండలంలో మరో కేంద్రం లేకపోవడంతో విధిలేని పరిస్థితుల్లో రెడ్డిపల్లికే వెళ్లాల్సి వస్తోంది.

అన్ని సర్టిఫికెట్లు ఆన్‌లైన్‌లోనే..

మండలంలో ఒకే మీసేవ కేంద్రం ఉండటంతో ప్రజలు ఇబ్బందులు తప్పడం లేదు. ప్రస్తుతం ప్రతీది ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సిన పరిస్థితి ఉండటంతో అందరూ మీసేవ కేంద్రాలకే వెళ్తున్నారు. స్కూళ్లు, కాలేజీల్లో చదివే విద్యార్థులు కులం, ఆదాయం, నివాసం, పుట్టినతేదీ సర్టిఫికెట్ల కోసం ఆన్‌లైన్‌లోనే దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. దీనికితోడు రెవెన్యూకు సంబంధించిన చాలా దరఖాస్తులను మీసేవ కేంద్రంలోనే చేసుకోవాలి. దీంతో విద్యార్థులు, రైతులు చాలా మంది రెడ్డిపల్లి మీసేవ వద్దకే వెళ్లాల్సి వస్తోంది. ఒకటే కేంద్రం ఉండటం అందరూ అక్కడికే వెళ్లడంతో గంటల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి. కొంత మంది ఇతర మండలాల్లోని మీసేవ కేంద్రాలకు వెళ్తున్నారు. దీనిపై ప్రభుత్వ అధికారులు దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

మీసేవ కేంద్రాలు ఏర్పాటు చేయాలి



రెడ్డిపల్లిలో ఒకే మీసేవ కేంద్రం ఉండటంతో రైతులు, విద్యార్థులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చట్టుపక్కన గ్రామాల ప్రజలకు అంత దూరం వెళ్లడం ఇబ్బందిగా మారింది. గతంలో ఉన్న మీసేవ కేంద్రాలను తెరిపించేందుకు అధికారులు కృషి చేయాలి. మండలంలో మరికొన్ని కొత్త కేంద్రాలను కూడా ఏర్పాటు చేయాలి.

–జొన్నాడ రాజు, చిలుకూరు, మొయినాబాద్ మున్సిపాలిటీ

ప్రతిపాదనలు పంపాం



మొయినాబాద్ మండలంలో ప్రస్తుతం ఒకే మీసేవ కేంద్రం ఉంది. మండలంలో కొత్తగా మరో నాలుగు కేంద్రాల ఏర్పాటుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. మీసేవ కేంద్రాల అవసరాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం. దీనిపై ప్రభుత్వం అనుమతి ఇవ్వాల్సి ఉంది.

–గౌతమ్‌కుమార్, తహసీల్దార్, మొయినాబాద్

పచ్చిరొట్ట సాగుతో భూసారం పెంపు

జయశంకర్ వ్యవసాయ యూనివర్సిటీ శాస్త్రవేత్త డా.వాణి

మహేశ్వరం: వానాకాలం పంటకు ముందు రైతులు పొలాల్లో పచ్చిరొట్ట పైర్లను సాగు చేసుకుంటే భూసారం పెరుగుతుందని జయశంకర్ వ్యవసాయ యూనివర్సిటీ శాస్త్రవేత్త డా.వాణి సూచించారు. సోమవారం మండల పరిధిలోని నందుపల్లి గ్రామంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమం నిర్వహించి వ్యవసాయ, ఉద్యానవన శాస్త్రవేత్తలతో రైతులు సాగులో పాటించాల్సిన సలహాలు, సూచనలు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రైతులు భూసార పరీక్షలను చేసి వాటి ఆధారంగా వ్యవసాయాధికారుల సూచనల మేరకు పంటలను సాగు చేసుకోవాలన్నారు. వానాకాలం పంటలు సాగు చేసే ముందు పచ్చిరొట్ట పైర్లను సాగు చేసుకుంటే భూమి సారవంతం అవుతుందన్నారు. రసాయనిక ఎరువులకు బదులు సేంద్రియ ఎరువులను వాడితే పంట దిగుబడి అధికంగా రావడంతో పాటు తెగుళ్ల సోకవన్నారు. రైతులు ఎప్పుడు ఒకే విధమైన పంటను సాగు చేయొద్దని, పంటలను మార్పితే దిగుబడి వస్తుందన్నారు. ఈ ప్రాంతం హైదరాబాద్‌కు దగ్గర్లో ఉండడంతో ఉద్యాన పంటలు సాగు చేసుకుంటే అధిక లాభాలు వస్తాయన్నారు. డ్రిప్, స్ప్రింక్లర్ పద్ధతుల ద్వారా కూరగాయ, పండ్ల తోటల పెంపకం చేపట్టాలన్నారు. అంతకుముందు రైతులకు పంటల సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మెలకువలను శాస్త్రవేత్తలు వివరించారు. కార్యక్రమంలో ఉద్యానవశాఖ శాస్త్రవేత్త డా.రజిని, మండల వ్యవసాయాధికారి నాగమణి, ఏఈఓ దీనా, పంచాయతీ కార్యదర్శి జానయ్య, మాజీ ఉపసర్పంచ్ ఎండీ.ఉస్మాన్, రైతులు దేశపాగ కిష్టయ్య, విఠల్‌గౌడ్, దేశపాగ జంగయ్య, అలీ, చోటు తదితరులు పాల్గొన్నారు.



రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త డా.వాణి

రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన

నాగోలు: మహిళలు ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలని నాగోలు డివిజన్ కార్పొరేటర్ చింతల అరుణ సురేందర్ యాదవ్ అన్నారు. బ్లెండ్స్ కాలనీలో డాక్టర్ చిరుగుపాటి ప్రజ్ఞ ఆధ్వర్యంలో నిర్వహించిన మహిళలకు రొమ్ము కేన్సర్స్ పరీక్షలు, అవగాహన శిబిరాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. రొమ్ము కేన్సర్ 50 ఏళ్ల అంత కంటే ఎక్కువ వయస్సు ఉన్న మహిళలను ప్రభావితం చేస్తుందన్నారు. కణితులను తొలగించడానికి శస్త్రచికిత్స ద్వారా లేదా కేన్సర్ కణాలను చంపడానికి చికిత్స ద్వారా రొమ్ము కేన్సర్‌కు చికిత్స చేయవచ్చాన్నారు. అనంతరం డాక్టర్ ప్రజ్ఞా రొమ్ము కేన్సర్‌పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సామ రంగారెడ్డి, సరస్వతి, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఆపరేషన్ సిందూర్ దేశానికే గర్వకారణం



తిరంగా ర్యాలీలో పాల్గొన్న శ్వేతామధుకర్‌రెడ్డి

సైదాబాద్: ఆపరేషన్ సిందూర్‌తో మన త్రివిధ దళాలు దేశం ప్రజలు గర్వపడేలా చేశారని ఐఎస్‌సదన్ డివిజన్ కార్పొరేటర్ జంగం శ్వేతా మధుకర్‌రెడ్డి అన్నారు. ఆపరేషన్ సిందూర్ విజయోత్సవం సందర్భంగా సోమవారం ఐఎస్‌సదన్ డివిజన్ సింగరేణి కాలనీలోని ఫోకస్ హాస్పిటల్ నుంచి ఐఎస్‌సదన్ చౌరస్తా వరకు తిరంగా ర్యాలీ నిర్వహించారు. బీజేపీ నాయకులు, కాలనీవాసులు, మహిళలు పెద్దసంఖ్యలో ర్యాలీలో పాల్గొని జాతీయ జెండాలు చేతబూని దేశభక్తి నినాదాలతో హోరెత్తించారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ.. ఉగ్రవాదంపై తిరుగులేని పోరాటం చేస్తున్న కేంద్ర ప్రభుత్వానికి దేశ ప్రజలందరూ మద్దతు పలకాలన్నారు.

వేసవి శిక్షణ శిబిరాలు విజయవంతం

శంకర్‌పల్లి: గత 15 రోజుల నుంచి మండలంలో నిర్వహించిన వేసవి శిక్షణ శిబిరాలు విజయవంతమైనట్లు మండల విద్యాధికారి అక్బర్ ప్రకటించారు. సోమవారం మండలంలోని మోకిలతండా ప్రాథమిక పాఠశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో క్రీడా నైపుణ్యం, పుస్తక పఠనం, చిత్రలేఖనం తదితర అంశాలపై పట్టు వచ్చిందన్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు స్పష్టం చేశారు.

ఆరోగ్య కేంద్రంలో మెరుగైన సేవలందించాలి



ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కార్పొరేటర్ అరుణారవీందర్‌రెడ్డి

సైదాబాద్: ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలని సైదాబాద్ కార్పొరేటర్ కొత్తకాపు అరుణారవీందర్ రెడ్డి కేంద్రం సిబ్బందికి సూచించారు. సైదాబాద్ డివిజన్ పరిధిలోని క్రాంతినగర్ ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సోమవారం కార్పొరేటర్ ఆకస్మిక తనిఖీ చేశారు. సిబ్బంది సమయ పాలన, రోగులకు అందుతున్న సౌకర్యాల గురించి కార్పొరేటర్ అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్య కేంద్రానికి వచ్చే రోగులు వారి సహాయకులతో సత్ప్రవర్తనతో మెలగాని ఆమె సూచించారు. ఆరోగ్య కేంద్రంలో ఎలాంటి అదనపు వసతులు కావాలంటే తన దృష్టికి తీసుకు వస్తే వైద్యశాఖ అధికారులతో చర్చించి వాటిని ఏర్పాటు చేస్తానని కార్పొరేటర్ తెలిపారు.

స్ట్రామ్ వాటర్ లైన్ పనులు పూర్తి చేయాలి



పెండింగ్ పనుల గురించి జేసీకి వివరిస్తున్న కార్పొరేటర్

చైతన్యపురి: సరూర్‌నగర్ చెరువు నుంచి హుస్సేన్ మటన్ షాప్ వరకు చేపట్టిన స్ట్రామ్ వాటర్‌లైన్ పనులను త్వరగా పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని గడ్డిఅన్నారం కార్పొరేటర్ బద్దం ప్రేమ్‌మహేశ్వర్ సోమవారం జీహెచ్‌ఎంసీ ఈస్ట్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్‌ను కోరారు. ప్రజావాణి కార్యక్రమంలో కార్పొరేటర్ జోనల్ కమిషనర్‌ను కలిసి సరూర్‌నగర్ చెరువు లోతట్టు కాలనీలు వరద ముంపునకు గురి కాకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు. అలాగే న్యూ గడ్డిఅన్నారం కాలనీలో జరుగుతున్న స్టాం వాటర్‌లైన్ మరమ్మతులు చేయటంలో కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. పనులు ఆలస్యం కావడంతో కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. డివిజన్ పరిధిలోని మధురాపురి, శ్రీకృష్ణానగర్, కాలనీ, పీఅండ్‌టీ కాలనీ చౌరస్తాతో పాటు మరి కొన్ని కాలనీల్లో నూతన సీసీ రోడ్డు పనులకు జీహెచ్‌ఎంసీ నిధులు మంజూరు అయినా పనులు పూర్తి కాలేదని తగు చర్యలు తీసుకోవాలని జెడ్సీని కోరారు. పెండింగ్‌లో ఉన్న పనులపై అధికారులతో సమీక్ష చేసి పూర్తి అయ్యేలా చూస్తానని జెడ్సీ హామీ ఇచ్చినట్లు కార్పొరేటర్ తెలిపారు.

కాంగ్రెస్ పాలనలోనే నిరుపేదలకు న్యాయం



ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో సమావేశమైన కమిటీ సభ్యులు, పంచాయతీ కార్యదర్శి

కందుకూరు: కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో నిరుపేదలకు న్యాయం జరుగుతుందని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కప్పాటి పాండురంగారెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని బాచుపల్లిలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గత పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో ఒక్క పేదవాడికి ఇల్లు ఇవ్వలేదని విమర్శించారు. అప్పట్లో తెలంగాణకు మిగులు ఆదాయం ఉన్నా పేదలకు ఆనాటి ప్రభుత్వం చేసింది ఏమీ లేదన్నారు. 15 నెలల వ్యవధిలోనే సీఎం రేవంత్‌రెడ్డి సహకారంతో మాజీ ఎమ్మెల్యే కేఎల్‌ఆర్ నియోజకవర్గానికి పెద్దఎత్తున నిధులు తెప్పించి అభివృద్ధి పనులు చేపట్టేలా కృషి చేశారని కొనియాడారు. కార్యక్రమంలో ఇందిరమ్మ కమిటీ సభ్యులు చెవులపల్లి కృష్ణ, మల్లగల విజయ్, కొంతం యుగేంధర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ యాలాల శ్రీనివాస్, నాయకులు కె.వెంకటేశ్, నవీన్‌గౌడ్, కుమార్, రాజశేఖర్, లబ్ధిదారులు పాల్గొన్నారు.

నిరుపేదల సంక్షేమమే ధ్యేయం

మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ యాదయ్య



అమీర్‌పేట్‌లో లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేస్తున్న యాదయ్య, తహసీల్దార్ సైదులు

మహేశ్వరం: నిరుపేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చాకలి యాదయ్య అన్నారు. సోమవారం మండల పరిధిలోని అమీర్‌పేట్ గ్రామంలో 52 మంది ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వంలో పేదలను న్యాయం జరుగుతుందన్నారు. అర్హత కలిగిన ప్రతీ ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తుందన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఎస్సీ, ఎస్టీలకు రూ.6లక్షలు, బీసీ, ఓసీలకు రూ.5లక్షలు ఆర్థిక సహాయం అందించనుందన్నారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వంలో ఇందిరాగాంధీ హయాంలో పేదలకు భూములు పంపిణీ, ఇళ్ల స్థలాలు, ఇళ్లు పంపిణీ చేసిందన్నారు. రాజశేఖర్‌రెడ్డి హయాంలో అర్హత కలిగిన ప్రతీ ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశారని గుర్తుచేశారు. పదేళ్ల బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో ఒక్కరికి కూడా డబుల్ బెడ్రూం ఇళ్లు ఇవ్వకుండా మోసం చేసిందని విమర్శించారు. అంతకుముందు గ్రామంలో లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను ఆయన అధికారులతో కలిసి పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామ ప్రత్యేకాధికారి, తహసీల్దార్ సైదులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు ఆవుల యాదయ్య, గల్లా యాదయ్య, ఆవుల రఘుపతి, వర్కల రమేశ్‌గౌడ్, ఎర్ర చంద్రమోహన్, కడల భాస్కర్, గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు ఐతాబాద్ రాజేందర్, పంచాయతీ కార్యదర్శి నవీన్, బాల్‌రాజ్, ఎండీ. షఫీ, మల్లేశ్, రాజుగౌడ్, శ్రీను, బాలు పలువురు పాల్గొన్నారు.

కోళ్లపడకల్, గొల్లూర్ గ్రామాల్లో..

మండల పరిధిలోని కోళ్లపడకల్, గొల్లూర్ గ్రామాల్లో లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను పంచాయతీ కార్యదర్శులు సోమవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కల్పన, కాంగ్రెస్ ఎస్సీ సెల్ రాష్ట్ర కన్వీనర్ నందిగామ నర్సింహ, మండల కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు పెండ్యాల బాల్‌రాజ్, నాయకులు హరినాద్ గౌడ్, యాదయ్య, భాస్కర్, ప్రవీణ్, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.



ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి, నాయకులు



మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డికి జ్ఞాపికను అందిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు

కందుకూరు: మండల పరిధిలోని పులిమామిడిలో పునర్నిర్మించిన శ్రీశివరామాంజనేయ స్వామి దేవాలయంలో సోమవారం దేవతామూర్తుల విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. వేద పండితుల సమక్షంలో శివ, రామ పరివారాల విగ్రహాలతో పాటు ఆంజనేయస్వామి, నవగ్రహాలు, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో జరిపించారు. అనంతరం శివపార్వతులు, సీతారాముల కల్యాణాన్ని నిర్వహించారు. భక్తులు పెద్దఎత్తున పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. కాగా స్థానిక ఎమ్మెల్యే సబితారెడ్డి, మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి, బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి, జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డితో పాటు వివిధ పార్టీల నాయకులు హాజరై పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు దామోదర్‌గౌడ్, పాండుగౌడ్, మల్లయ్య, రవీందర్, పాండురంగారెడ్డి, వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్, సాలయ్య, పి.రాములు, చంద్రపాల్, వెంకటేశ్, వెంకటేశ్‌చారి, మహేశ్, శేఖర్, మాజీ వైస్ ఎంపీపీ సంధ్య, మాజీ సర్పంచ్‌లు అంజయ్యగౌడ్, దేవి తదితరులు పాల్గొన్నారు.

పేదల అభ్యున్నతికి సుందరయ్య కృషి



సుందరయ్య చిత్రపటానికి శ్రద్ధాంజలి ఘటిస్తున్న చంద్రమోహన్



సుందరయ్య చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న నాయకులు

హస్తినాపురం: జీవితాంతం పీడిత ప్రజల కోసం పోరాటం చేసిన మహోన్నతమైన వ్యక్తి పుచ్చలపల్లి సుందరయ్య అని రంగారెడ్డి జిల్లా సీపీఎం పార్టీ కార్యవర్గ సభ్యులు చంద్రమోహన్ అన్నారు. హస్తినాపురం డివిజన్ పరిధిలోని సాగర్‌రింగ్‌రోడ్డులోని చౌరస్తాలో ఎల్‌బీనగర్ సర్కిల్ సీపీఎం పార్టీ కార్యదర్శి ఆలేటి ఎల్లయ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సుందరయ్య వర్ధంతి కార్యక్రమంలో చంద్రమోహన్ పాల్గొని శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా చంద్రమోహన్ మాట్లాడుతూ.. దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో క్రియాశీలక పాత్ర పోషించడమే కాకుండా వీర తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో నిజాం నవాబులకు వ్యతిరేకంగా పోరాటం చేసి 10 లక్షల ఎకరాల భూములను పేద ప్రజలకు పంపిణీ చేసిన యోధుడు పుచ్చలపల్లి సుందరయ్య అన్నారు. చట్టసభల్లో వ్యక్తులపై వ్యక్తిగత విమర్శలు చేయకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకువస్తున్న విధానాల ప్రాతిపదికగా అర్థవంతమైన రీతిలో ప్రజా సమస్యలను చర్చించి పార్లమెంట్‌ను ప్రజా సమస్యల చర్చావేదికగా నిలిపారని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో రవీందర్, రామస్వామి, దుర్గారావు, మంతాని యాదయ్య, గడ్డం రవీందర్, బి.కాశయ్య, లక్ష్మయ్య, రాధమ్మ, గంగమ్మ, ఎల్లమ్మ, చిరంజీవి పాల్గొన్నారు.

నాగోలులో..

నాగోలు: పేదప్రజల సమస్యలపై పోరాడిన యోధుడు పుచ్చలపల్లి సుందరయ్య అని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రమోహన్, జిల్లా ఉపాధ్యక్షులు కీసరి నర్సింరెడ్డి అన్నారు. సోమవారం నాగోలులో పుచ్చపల్లి సుందరయ్య వర్ధంతి వేడుకలు నిర్వహించిన సుందరయ్య చిత్రపటానికి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. సుందరయ్య ఆశయ సాధన అంటే నిరంతరం పేద ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారాల కోసం పాటు పడటమే అన్నారు. ఈ కార్యక్రమంలో మల్లేశం, ఎల్లయ్య, కృష్ణయ్య, మల్లేశం, చైతన్య పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి



అధికారులు, కాలనీవాసులతో చర్చిస్తున్న కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డి

వనస్థలిపురం: అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డి అన్నారు. హయత్‌నగర్ డివిజన్ పరిధిలోని శారదానగర్ కాలనీలో నూతనంగా సీసీ రోడ్ల పనులు ప్రారంభం కానున్న సందర్భంగా కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డి సంబంధిత అధికారులతో కలిసి కాలనీలో పర్యటించి పనులపై సమీక్షించారు. వెంటనే పనులు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ ఏఈ హేమునాయక్, వర్క్ ఇన్‌స్పెక్టర్ సురేష్, కాలనీ సంక్షేమ సంఘం నాయకులు పాల్గొన్నారు.